## క్లుప్తంగా

### మాతాశిశు మరణాల రేటు తగ్గించేందుకు సహకరించాలి



పిట్టలవానిపాలెం : మాతా శిశు మరణాల రేటు తగ్గించేందుకు వైద్య సిబ్బంది సహకరించాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జరీనా పర్వీన్ కోరారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య సిబ్బందికి మాతా శిశుమరణాల రేటు తగ్గించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. సుఖ ప్రసవం అయ్యేందుకు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు.

### హిందూ ధర్మపరిరక్షణకు కృషి చేయాలి



రేపల్లె: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమసరతా సేవా ఫౌండేషన్ జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ మండల సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ధర్మ పరిరక్షణకు ఫౌండేషన్ నిరంతరం కృషిచేస్తుందని చెప్పారు. ధార్మిక కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనేలా ఫౌండేషన్ సభ్యులు చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మహిళా కన్వీనర్ లంకా కృష్ణ కుమారి, శొంఠి బాబూరావు, నంబూరు వేణు, గుంటి సాంబశివరావు పాల్గొన్నారు.

### ఘనంగా శాంతి కల్యాణ మహోత్సవం



నగరం: ఈదుపల్లి గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థాన 8వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహ వచన, పంచగవ్యప్రాశన, శివ మండపారాధన మహాన్యాస రుద్రాభిషేకం ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల కుమార్‌శర్మ అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. సాయంత్రం శాంతి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారికి విశేష పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం మల్లికార్జునస్వామి గ్రామోత్సవం, అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తుమ్మల శేషగిరిరావు పాల్గొన్నారు.

### వైభవంగా ధ్వజస్తంభాల ప్రతిష్ఠ



బాపట్ల అర్బన్: బాపట్ల రూరల్ కొండుబొట్లపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక, శ్రీ వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి వార్ల ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా సోమవారం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహం, జీవధ్వజాల యంత్ర స్థాపన, ధ్వజ ప్రతిష్ఠ, శ్రీ వెంకటేశ్వర స్వామి, లక్ష్మీదేవి, వినాయక, అయ్యప్ప స్వాములు, యంత్ర స్థాపన రాజగోపుర, విమాన గోపుర శిఖర స్థాపనలు అత్యంత వైభవంగా జరిగాయి. సాయంత్రం విశేష హోమాలు, కుంభారాధన జరిగినాయి. చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. టీటీడీ ఆగమ సలహాదారు శ్రీమాన్ నల్లూరి వెంకట మోహన్ రంగాచార్యులు ఆధ్వర్యంలో రిత్వికులు బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఆలయ పాలకవర్గం, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కర్లపాలెం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మానవులందరిపై ఉందని, అందరూ మొక్కలు పెంచాలని తహసీల్దారు జి. కేశవ నారాయణరావు, ఎంపీడీవో డి.రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కర్లపాలెం మహిళా సమాఖ్య పొదుపు మహిళలు, గ్రామ సచివాలయం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మానవహారం ఏర్పాటు చేసి, పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. సంపద సృష్టి కేంద్రం వద్ద జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో డి.రాంబాబు మొక్కలు నాటారు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఎం.శ్రీనివాసులురెడ్డి డ్వాక్రా మహిళలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్త్రీ నిధి జిల్లా ఏజీఎం నాగబాబు, మేనేజర్ కామేశ్వరి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి, సీసీలు పూర్ణ చంద్రరావు, శివకోటేశ్వరరావు, సోమేశ్వరి, కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఓ జాషువా, డ్వాక్రా మహిళలు, సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

**ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి**

చెరుకుపల్లి: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ.. పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ ప్రతిజ్ఞ చేయించారు. భవిష్యత్తు తరాల వారికి సహజవ నరులు సంవృద్ధిగా అందించాలంటే ..ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి, పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఏపీఎం డి.వెంకటేశ్వర్లు, సీసీలు బాటసారి, నాగకుమారి, ఎంఎస్ఎ ఇందిరా, వీవో ఏలు తదితరులు పాల్గొన్నారు.

నగరం: ప్లాస్టిక్ వాడకం తగ్గించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ గోగినేని హనుమంతరావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత ర్యాలీని ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ ప్రారంభించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు రహదారుల వెంట ఉన్న ప్లాస్టిక్ డబ్బాలను తొలగించారు. కార్యక్రమంలో ప్రసన్న కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో రాంబాబు, తహసీల్దారు కేశవ నారాయణరావు

కోనేటిపురం(భట్టిప్రోలు): ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని కోనేటిపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐటీసీ–సెర్ప్ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద కూడా మొక్కలు నాటారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నానీ), పంచాయతీ కార్యదర్శులు అడిగోపుల చిన వెంకటేష్‌బాబు, పి. ప్రదీప్ కుమార్, ఐటీసీ ప్రతినిధి చక్రవర్తి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం**

పిట్టలవానిపాలెం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని వైఎస్సార్ సీపీ నాయకులు గాదె మధుసూదనరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు దేగల రవిరెడ్డి, కుంచల వీర రాఘవరెడ్డి, దోమ నాగేశ్వరరెడ్డి, మద్దాల డేవిడ్ పాల్గొన్నారు.



ర్యాలీలో మహిళా సమాఖ్య సభ్యులు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్యదర్శి సాయిబాబు, ప్రిన్సిపల్ మాల్యాద్రి

బాపట్ల అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. మాల్యాద్రి, అధ్యాపకులు ప్రతాప్, లావణ్య, కలాం, విద్యార్థులు పాల్గొన్నారు. హరిత జీవన శైలిని అలవర్చుకోవాలి, మానవులు అభివృద్ధి పేరిట, విలాసాల కోసం ప్రకృతి వనరులను విచక్షణా రహితంగా ధ్వంసం చేస్తున్నారని వారు అన్నారు.

బాపట్ల అర్బన్ : డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ వేడుకల సందర్భంగా అసోసియేట్ డీన్ డీడీ స్మిత్ అధ్యక్షతన విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణపై అవగాహన సదస్సు జరిగింది. ప్రపంచంలో సుమారు 400 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకం ఆహారం పదార్థాలను పూర్తిగా కలుషితం చేస్తోందని వివరించారు. అసోసియేట్ డీన్, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ బి.రాజ్ కిరణ్, డాక్టర్ లావణ్య, కేవీఎస్ రామిరెడ్డి మాధవ, డాక్టర్ ఆర్ గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపల్, ఎన్‌సీసీ ఆఫీసర్, విద్యార్థులు



కోనేటిపురంలో మొక్కలు నాటుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల



మొక్కను నాటుతున్న గాదె



మొక్కలు నాటుతున్న అసోసియేట్ డీన్, అధ్యాపకులు, విద్యార్థులు

# ‘స్పందన’కు 7 అర్జీలు

రేపల్లె: స్పందన కార్యక్రమానికి ఏడు అర్జీలు అందినట్లు ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆయన అర్జీలు స్వీకరించారు. వృద్ధాప్య పింఛనుకు, చెరువులో పూడిక తీత కోసం రేపల్లె పట్టణం నుంచి ఒక్కొక్క అర్జీ అందినట్లు ఆర్డీఓ తెలిపారు. చెరువు గట్టు ఆక్రమణలు తొలగించాలని సజ్జావారిపాలెం నుంచి ఒకటి, తమ తల్లి స్థలం ఆన్‌లైన్‌లో దేవాదాయ శాఖ పరిధిలోకి ఉన్నదని చూపుతోందని సమస్యను పరిష్కరించాలని భట్టిప్రోలు నుంచి ఒక అర్జీ అందిందన్నారు. భట్టిప్రోలు మండలం వీఆర్‌ఏ నియామకాలలో జరిగిన అవకతవకలు సవరించాలని, డ్రెయిన్‌లలో పూడిక తీత చేపట్టాలని అర్జీలు అందాయని చెప్పారు.

**అడవుల దీవి, చోడాయపాలెం మండలాలు ఏర్పాటు చేయాలి..**

రేపల్లె రెవిన్యూ డివిజన్ ఏర్పడిన నేపథ్యంలో రేపల్లె మండలంలోని చోడాయపాలేన్ని, నిజాంపట్నం మండలంలో అడవుల దీవిని ప్రత్యేక మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరుతూ జై భీమ్ భారత్ పార్టీ నాయకులు ఆర్డీవో పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దోవా రమేష్‌రాంజీ, నాయకులు సుబ్బారావు, బాబూరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న జై భీమ్ భారత్ పార్టీ సభ్యులు

# విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

బాపట్ల అర్బన్: పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ నుంచి 3వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, డిబెట్ పోటీలను ప్రధానోపాధ్యాయుడు నాగవర్ధన్ సోమవారం నిర్వహించారు. స్థానికంగా నివశిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేవిధంగా చైతన్య పరిచారు. ఐదు సంవత్సరాలు నిండిన బడిఈడు పిల్లలను ముగ్గురిని గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. పిల్లలతో స్థానికంగా నిపుణ్ భారత్‌లో భాగంగా జన్‌భాగీదారిపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పిల్లలకు పర్యావరణం ఎలా కాపాడుకోవాలి, దాని ఆవశ్యకతను వివరించారు. పాఠశాలకు చేరుకుంటున్న జేవీకే కిట్‌లను పరిశీంచారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో అసిస్టెంట్ ఏఎంఓ బి.మోజెస్, అసిస్టెంట్ ఏఎల్ఎస్, వీఎస్.సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.



డిబెటింగ్‌లో విద్యార్థిని, పక్కన హెచ్‌ఎం నాగవర్ధన్, మోజెస్

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నిజాంపట్నం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సోదరుడు మోపిదేవి హరనాథబాబు పేర్కొన్నారు. నక్షత్ర నగర్‌లో మోపిదేవి రాజీవ్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులు ఎంతో ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. విద్యతోపాటు క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలని తెలిపారు. టోర్నమెంటు విజేత జట్టుకు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, ఎంపీటీసీలు లంకె శ్రీనివాసరావు(ఎల్ఎస్ఆర్), గోపాలకృష్ణ, నాజర్‌ఖాన్ పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మోపిదేవి హరనాథబాబు

# ‘ఉపాధి’ కూలీల సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల అర్బన్: ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెండ్రు ఆంజనేయులు, టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉపాధి కూలీలను ప్రతి రోజు తీసే ఫోటోను ఎత్తివేయాలని, మేట్ల వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు 200 రోజులు తగ్గకుండా పని దినాలు కల్పించాలని కోరారు. అనంతరం స్పందనలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి, వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, బొనిగల సుబ్బారావు, మురుగుడు సత్యనారాయణ, శ్రీనివాసరావు, సుబ్బరాజు, సుబ్బారావు, వీరయ్య, కేవీపీఎస్ జిల్లా నాయకులు కె.శరత్, సీఐటీయూ టౌన్ కార్యదర్శి జంగం శామ్యూల్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి పవర్
- అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలతో భేటీ

తెనాలిటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి భారతి పవార్ కోరారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దుగ్గిరాల సీసీఎల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే మురుగు నీటి వల్ల తాగునీరు కలుషితం అవుతోందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీటీసీ–2 సభ్యులు కాలిశెట్టి ఫణికుమార్ కేంద్ర సహాయ మంత్రికి వినతిపత్రం అందజేశారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు సంబంధించిన పరికరాలు సమకూర్చాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ దిలీప్ వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భారతి పరివార్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో వైద్యులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు చేసిన సేవలు అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. తొలుత అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో సహాయమంత్రి భారతి పవార్ ఫొటోలు దిగారు. పార్టీ రాష్ట్ర మహిళామోర్చా అధ్యక్షురాలు నిర్మలా కిషోర్, నాయకులు పాతూరి నాగభూషణం, పాటిబండ్ల రామకృష్ణలు మాట్లాడారు. తొలుతగా పార్టీ నాయకులు తోటకూర కోటేశ్వరరావు స్వాగతం పలికారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు కె.యోగానంద కిషోర్, కాలిశెట్టి భావన్నారాయణ, అత్తలూరి బ్రహ్మయ్యయ, పాకాల సత్యనారాయణ, అన్నవరపు వేణు, మైలా హరికృష్ణ, బిట్రా కనక దుర్గ, తాళ్ళూరి బుల్లెబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భారతిపవార్

# హోరా హోరీగా క్రికెట్ టోర్నీ

కొల్లూరు: యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న వైఎస్సార్ స్మారక హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ హోరా హోరీగా సాగుతోంది. కొల్లూరు బాలురు, బాలికోన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేమూరు నియోజకవర్గస్థాయి పోటీల్లో సోమవారం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. భట్టిప్రోలు హైటెక్ సీసీ జట్టుపై జువ్వలపాలెం జట్టు విజయం సాధించగా, దుండిపాలెం ఆర్‌సీఎం యూత్ జట్టుపై ఇంటూరు జట్టు గెలుపొందింది. కాకర్లమూడి కింగ్స్ జట్టుతో తలపడిన అబ్బనగూడవల్లి జట్టు గెలుపొందగా, తురకపాలెం జైభీమ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో చావలి వాలేశ్వరస్వామి జట్టు గెలుపును సొంతం చేసుకుంది. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ నేతృత్వంలో జరుగుతున్న ఈ పోటీలలో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, ఓడిన జట్లకు ప్రోత్సాహక బహుమతిగా క్రికెట్ బ్యాట్‌లను కొల్లూరు–4 ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు.



క్రికెట్ జట్టుకు బ్యాట్‌ను బహూకరిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు నవరత్నం

# అనుమతులు లేని ఇసుక రీచ్ పనులు నిలిపివేత

కొల్లూరు: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక క్వారీ నిర్వహణకు చేపడుతున్న పనులను రెవెన్యూ యంత్రాంగం నిలువరించింది. మండలంలోని జువ్వలపాలెం వద్ద కృష్ణా నదిలో గత కొద్ది రోజులుగా ఇసుక తవ్వకాల కోసం యంత్రాల సాయంతో రోడ్డు ఏర్పాటు పనులు చేపట్టారు. అనుమతులు లేని ఇసుక క్వారీ పనుల విషయం కొల్లూరు తహసీల్దారు ఎ. శ్రీనివాసరావుకు తెలియడంతో సోమవారం సాయంత్రం క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవన్న విషయాన్ని గుర్తించారు.

పనులను చేపడుతున్న సంబంధిత వ్యక్తులను ఫోన్‌లో ప్రశ్నించారు. తక్షణం పనులు నిలిపివేయాలని తహసీల్దారు ఆదేశించారు. ప్రొక్లెయినర్‌లను నది ఒడ్డుకు తరలించారు. ఈ విషయమై.. జేసీ శ్రీధర్‌కు తహసీల్దారు సమాచారం అందించారు. ఇకపై ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలని జేసీ తహసీల్దార్‌ను ఆదేశించారు. దీనిపై తహసీల్దారు శ్రీనివాసరావు స్పందిస్తూ.. నదిలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీటీ సృజన్, ఆర్ఐ త్రివేణి, వీఆర్ఓ బిక్షాలు ఆయన వెంట ఉన్నారు.



క్వారీ పనులు నిలిపివేయాలని ఆదేశిస్తున్న తహసీల్దారు

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



కొల్లూరు: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి, బాలలను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని తెనాలి మండల న్యాయం సేవాధికార సంస్థ పీఎల్వీ యర్రంశెట్టి అనీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గాజుల్లంక సచివాలయం వద్ద నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. బాలలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకాల మేరకు అర్హులైన వారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



పేరలి(కర్లపాలెం): ఆపదలో ఉన్న వారికి చేయూతనందించటం వల్ల సంతృప్తి కలుగుతుందని బాపట్ల పారిశ్రామికవేత్త ఆర్మి రవి పేర్కొన్నారు. పేరలి పంచాయతీ పాతపాలెం గ్రామానికి చెందిన కాగిత సుబ్బారావు(60) అనారోగ్యంతో బాధపడుతూ వడగాలులకు తాళలేక సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన సుబ్బారావు మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.10వేల నగదు అందజేశారు. అలాగే పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పేరలి బాలకృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య రూ.5వేల నగదు అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి మద్దిబోయిన శివరావు, గేరా ఏసుబాబు, షేక్ సుభానీ, కాగిత వీరన్న, మల్లెల కరుణాకర్, కుమార్, కాగిత మణి, దేవరంపాటి రాజ తదితరులు ఉన్నారు.

పేరలి(కర్లపాలెం): ఆపదలో ఉన్న వారికి చేయూతనందించేందుకు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ముందుంటుందని గౌరవాధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు తెలిపారు. పేరలి గ్రామానికి చెందిన గొర్రుముచ్చు విజయశాంతి అనారోగ్యంతో బాధపడుతుండటంతో.. ఆర్గనైజేషన్ సభ్యులు సోమవారం ఆమెకు రూ.5వేల నగదు అందజేశారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, ఉపాధ్యక్షుడు జంగం దాసు, కార్యదర్శి బత్తుల సురేష్, ట్రెజరర్ జోగి సువర్ణరాజు, విన్నకోట సురేష్, కత్తి రాజు, కొటికలపూడి జయరాం, కందుల శ్రీకాంత్ ఉన్నారు.

## వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

భట్టిప్రోలు: పేద ప్రజలకు చెందాల్సిన వక్ఫ్ ఆస్తులు దళారుల చేతుల్లో ఉన్నాయని, వాటిని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్ పేర్కొన్నారు. సోమవారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి పీర్ల చావిడికి చెందిన సుమారు 13 ఎకరాలను ఈ నెల 8న తహసీల్దారు కార్యాలయంలో జిల్లా వక్ఫ్ అధికారులు పూర్తి సమాచార నివేదికతోనే వేలంపాట నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని స్పష్టం చేశారు. దశాబ్దాల తరబడి వక్ఫ్ ఆస్తులు పర్యవేక్షణ లేక అన్యాక్రాంతమయ్యాయని వెల్లడించారు. వాటికి ప్రభుత్వం చిత్తశుద్ధితో బహిరంగ వేలంపాట నిర్వహించడం జరుగుతుందన్నారు. కొందరు అవగాహన రాహిత్యంతో స్థానిక నాయకులు, అధికారులతో కుమ్మక్కై వేలం నిర్వహిస్తున్నారని అనడం వారి అవివేకమన్నారు. బహిరంగ వేలంపాటలో ఆసక్తి గల ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చునని చెప్పారు. ఇందులో ఎటువంటి గోప్యత లేదని వివరించారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వక్ఫ్ భూములను పరిరక్షించే విధంగా అడుగు లేయడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వం, అధికారులపై నిందలు వేయడం మానుకోవాలని సలీమ్ హితవు పలికారు.

## గుంటూరెళ్లి..పింఛను ఇచ్చి



భట్టిప్రోలు: కోనేటిపురానికి చెందిన మోర్ల పాములు గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ పానుగంటి నాగబాబు అక్కడకు వెళ్లి దివ్యాంగ పింఛను నగదు రూ.3వేలు అందించారు. పాములు రెండు రోజుల క్రితం వెన్నుపూసకి సర్జరీ చేయించుకుని గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్‌ను ఆయన కుటుంబ సభ్యులు అభినందించారు.

**మంగళగిరి వెళ్లి పింఛను అందజేత**

భట్టిప్రోలు: ఐలవరం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు పడమట శ్రీనివాసరావు అనారోగ్యంతో మంగళగిరి ఎయిమ్స్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. సోమవారం గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు ఆదేశాను సారం వలంటీర్ రాచాబత్తుని మాధవి మంగళగిరి వెళ్లి ఆయనకు పింఛను నగదు అందజేశారు. వలంటీర్‌ను ఆయన కుటుంబ సభ్యులు అభినందించారు.